

# శిలకోల

మల్లిపురం జగదీశ్

తలుపు కొట్టిన చప్పుడయ్యింది. టైమ్ చూశాను. అతనే. గుండెల నిండా ఊపిరి పీల్చి వదిలాను. లేవకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ తలుపు గడియ తియ్యకూడదని నిర్ణయించుకున్నాను.

తలుపు తీస్తే...?

సిగరెట్ పొగ వస్తుంది. ఆ వెనుక అతనొస్తాడు. మందువాసన గుప్పుమంటుంది. ముక్కుని చేత్తో అడ్డు కోకుండా నిలబడాలి. నవ్వాలి. తింటానంటే వడ్డించాలి. ఆ తర్వాత అసహ్యాన్నంతా భరించాలి.

కళ్లు మూసుకున్నాను.

చీకటి... కళ్లను కాటేస్తున్న చీకటి.

*

"నీకో గుడ్ న్యూస్."

"..." అతనివైపు చూశాను.

"మనది ఎస్టీ నియోజకవర్గం- తెలుసుకదా," అన్నాడు. ఈమధ్య రాజకీయ నాయకులతో తిరగడం... వాళ్లతో పార్టీలు... తాగుడు... ప్రతిరోజూ ఇదే వేళకు రావడం గుర్తొచ్చింది.

"ఔను... అయితే?"

"టికెట్ కోసం బోల్డుమంది ట్రై చేస్తున్నారు తెల్సా?"

"చెయ్యనీ... అయితే మనకేటి?" ఏదో ప్రమాద సంకేతం పసిగట్టేను.

"మనకేటంటావేటి? మొన్నామధ్య మన గురించే డిస్కషన్ వచ్చిందట తెల్సా?" అంటూ లేచేడు.

"మన గురించా? ఎందుకు ఏమిటి?"

"ఓసి పిచ్చిదానా ఇంకా అర్థమవలేదా... పార్టీ టికెట్ నీకివ్వడానికి," అంటూ లైట్ వేశాడు.

కళ్లు జిగేల్మన్నాయి.

ఔను పిచ్చిదాన్నే. పార్టీ టికెట్ నాకు ఇస్తే... జనం నన్ను గెలిపిస్తారు. గెలిస్తే, పేరుకి మాత్రం నేను ఎమ్మెల్యేని. కాని చక్రం తిప్పేదెవరు? ఇవేవీ అర్థం కాని పిచ్చిదాన్ని. అర్థమయినా భరిస్తున్న పిచ్చిదాన్ని.

"పార్టీ ఏమిటి? టికెట్టేమిటి?" ఇంకా వివరాలు కావాలన్నట్టు అడిగేను.

"ఓసి జడ్డిమొహమా, నీకేమీ తెలీదు. ఒకటికి పదిసార్లు చెప్పాలి. ఎమ్మెల్యే సీటంటే ఆషామాషీ కాదు. అది మనకే వస్తుందంటే వదులుకుంటామా?" నిర్ణయ మేదో ముందే తీసుకున్నట్టు అన్నాడు.

ఔను... అర్థమవకే ఇన్నాళ్లు నువ్వెన్ని వేషాలేసినా భరించేను. ప్రతి విషయాన్ని పదేపదే చెప్పించుకుంటూ నీ నీడకొచ్చేను.

"మరి ఉద్యోగం?" అన్నాను, అతనేమంటాడో నని.

"బోడి ఉద్యోగం. పట్టుచీర కట్టుకోడానికిస్తే చింకిపాతకి సాపిందట ఒకర్తి... అలాగుంది నీ వరస... అందుకే అన్నారు మిమ్మల్ని కొండోళ్లని."

కొండోళ్లమే... ఏమీ తెలియని అమాయకులమే... అందుకే పల్లపోల్ల తెలివి తేటలు కొండ మీద చెల్లు తున్నాయి. అది ఈనాటిదా!

ఉద్యోగమొచ్చిన తొలిరోజులు గుర్తొచ్చేయి.

ఐ.టి.డి.ఎ.లూ... జి.సీ.సీ.లూ... హాస్టళ్లూ పెట్టిన రోజులవి. వలసలు, గూడలు ఇంకా కొండచాటునే...

అడవి మాటునే ఉన్న రోజులవి. సొండీలు, షావుకార్లు అడవిని వదిలి వెళ్లిపోయేరనుకునే రోజులు. అడవి కయిన గాయాలు మానలేదు. కొత్తవాళ్లెవరొచ్చినా అను మానంగానే... మౌనం మాటున నలిగి, వణికిపోతున్న రోజులవి.

“నేస్తం రా... ఇక్కడొక ఏలిముద్రెయ్యిమీ,” అంటూ గడపలోకొచ్చేడు జగన్నాథం. అతను నాన్నకి నేస్తం. గూడలన్నీ తిరిగి వ్యాపారం చేసేవాడు. అప్పు డెప్పుడో నాన్నకి అప్పు ఇచ్చేడు. అప్పటి నుండి కొండ మీద పండిన కందులు, జొన్నలు, రాగులు కొలిచి అప్పు తీరుస్తూనే ఉండేవాడు నాన్న. పొగాకు ముక్కో, సారా చుక్కో ఇచ్చి నాన్నతో నేస్తరికం చేసేడు. అందుకు నాన్న పనసపళ్లు, అరటికాయలు, సీతాఫలాలు, చింత పండు ప్రేమతో ఇచ్చేవాడు.

కొన్నేళ్ల తర్వాత...

వ్యాపారం వదిలి కాంట్రాక్టరయ్యేడు జగన్నాథం.

నాన్న వేలిముద్ర వేసి, వేలికంటిన ఇంకుని తలకు రాసి తుడుచుకుంటున్నాడు.

“నేస్తమూ... మనూరికి హాస్టలు బిల్డింగు శాంక్ష నైంది. వర్కు నీ పేరునే వచ్చిందిలే. సిమెంటు, ఐరను, ఇసక అన్నీ మన గడపలో ఏయించేస్తాను. జాగ్రత్త మరి. పనోళ్లకి సెప్పి బెత్తాయించు. నువ్వు మేనేజరువి గదా,” అన్నాడు జగన్నాథం.

నేస్తమన్న మాటకి నాన్న పొంగిపోయేడు.

“నేస్తమూ అవన్నీ సెప్పాలా...? నీకేం బెంగలేదు. నేను సూసుకుంతాను గదా... నువ్వెళ్లు...” అని అభయ మిచ్చేశాడు.

ప్రతిరోజూ స్కూటర్ మీద వచ్చి కన్‌స్ట్రక్షన్ చేయిస్తూ వెళ్లేవాడు జగన్నాథం.

ఒకరోజు నన్ను చూసేడు. వేసవి సెలవులకని హాస్టల్ నుండి వచ్చి ఉన్నాన్నేను. నాతో మాటా మాటా కలిపేడు. పని కల్పించుకుని మరీ మా ఇంటికొచ్చే వాడు. సినిమా పత్రికలు ఇచ్చి, సినిమాల గురించి మాట్లాడేవాడు. పదో తరగతి చదువుతున్న నాకు ఐ.టి.డి.ఎ. గురించి... అది కల్పించే అవకాశాల గురించి చెప్పేవాడు. ఆ క్రమంలో అతడు నాతో దగ్గరిగా మాట్లా డినా, ఏకాంతంగా మాట్లాడినా అమ్మానాన్నలు ఏమీ అనేవాళ్లు కాదు. ఎదుటివాళ్లను నమ్మడం ఈ నేల గొప్పదనమో, లేక అమాయకత్వమోగాని ఆ నమ్మకాన్ని సొమ్ము చేసుకోవడం మాత్రం పల్లపోడి నైపుణ్యం.

ఒక సాయంత్రాన పోస్ట్ రన్నర్ శంకరన్న నాకో కవర్ అందించేడు. గూట్లో దీపం ఎదుట చింపి చూసేను. అది ఇంగ్లీషులో ఉంది. నాకు అర్థంకాలేదు. తెల్లవారేక అతనికి చూపించేను. చదివేడు. నవ్వేడు. నవ్వి, నాన్నతో, “నేస్తం... నువ్వు పార్టీ ఇచ్చుకోవాలి. చామంతికి మనూర్లోనే టీచరమ్మగా వేసేరు,” అన్నాడు. నా చెయ్యందుకుని ఊపేడు. నా ఆనందం హద్దులు దాటింది. ఐ.టి.డి.ఎ. ఆఫీసుకి తీసుకెళ్లేడు. సర్టిఫికెట్స్ వెరిఫై చేయించేడు. సర్వీసు రిజిస్టరు రాయించడం, ఉద్యోగంలో చేరడానికి అవసరమైన ఏర్పాట్లు అన్నీ దగ్గ రుండి చేయించేడు. మా గడపలోనే, ‘గిరిజన విద్యా వికాస కేంద్రం,’ అని బోర్డు రాయించి రాటకి వేలాడ దీసేను. అతనివైపు కృతజ్ఞతతో చూసేను. అతను నవ్వేడు.

ఆ వయసులో జీతం డబ్బు ఏం చెయ్యాలో ఆలోచించేదాన్ని. కొత్త ఫేషన్లు, డ్రెస్‌లు... ఏవో సినిమాలు... షికార్లు ఇవే నా ఆలోచనలు.

బిల్డింగు పూర్తయ్యింది. రేపటి నుండి అతను కనిపించడు. ప్రతిరోజు నాకు తెలియకుండానే అతని కోసం ఎదురుచూడడం అలవాటైపోయింది.

ఆరోజు సాయంత్రం అతను కూలి డబ్బులు పంచుతున్నాడు. నాన్న సమక్షంలో అందరూ డబ్బు తీసుకుని స్నానానికని గెడ్డకి దిగిపోయేరు. బడి ముగించి పిల్లల్ని వదిలే సమయంలో వచ్చేడు. “చామంతీ,” అని పిలిచేడు. నవ్వేను పలకరింపుగా. అప్పుడు గమనిం చేను, ఇంట్లో ఎవరూ లేరని. ఇద్దరమే ఉన్నామని.

“మంచినీళ్లిస్తావా?” అన్నాడు. ఆ గొంతు ఎప్ప టిలా లేదు. ఇంకేదో అర్థం ధ్వనిస్తోంది. కుండలోని నీళ్లు గ్లాసుతో అందించేను. “రేపటి నుండి మరి కలుసు కోము. నీకేమి అనిపించడం లేదా?” అని గ్లాసు అందు కుంటూ నా వేళ్లని తాకేడు. ఒళ్లు ఝల్లుమంది. అతని వైపు సూటిగా చూడలేకపోయాను. గుండె బరువెక్కి నేల చూపులు చూసేను. “చామంతీ,” అంటూ ఇంకా దగ్గరికి జరిగేడు.

అప్పటికే చీకటి కమ్ముకుంది.

*

తలుపు తంతున్న శబ్దం.

చుట్టుపక్కల వాళ్లు ఎవరైనా లేచి వింటే...? అయినా వాళ్లకు మాత్రం కొత్త గనకనా? అలవాటైపో యింది. దుప్పటిలో దూరి చెవులు మూసుకున్నాను.

చీకటి... చీకటి... చీకటి...

నా కళ్ల నిండా నీరు. దుఃఖం ఆగడంలేదు. చీకటికో, గాలి ఆడకో, లేక దోమ కుట్టిందో... కెవ్వున అరిచింది పాప. లేచి జోకొట్టేను. జోల పాడేను. కిటికీ దగ్గర కెత్తుకెళ్లి చందమామని చూపించి ఊరడించ బోయాను. అవి అమావాస్య రోజులని గుర్తొచ్చింది. నా పిచ్చిగాని బతుకునిండా చీకటుంటే, ఇంకా వెన్నెలెక్క డ్నించి వస్తుంది? సొంత కులం కాకపోయినా అతన్ని నమ్మి తల్లిదండ్రుల్ని, ఊరుని, కట్టుబాట్లని వదులు కున్నందుకు నాకు తగిన శిక్షే పడింది. నా మనసడిగిన ఎన్నో ప్రశ్నల్ని అణిచివేసి సమాధానం దాటవేసినందుకు తగిన శాస్తి జరిగింది. అతనికి నేను రెండో భార్యనని తెలిసేనాటికి పాపకి ఏడాది నిండింది.

అతన్ని అడిగేను, నిలదీసేను, అరిచాను, ఏడ్చేను. అన్నిటికీ, 'క్షమించు,' అని ఒక్క మాటతో తేల్చేశాడు. అన్నింటినీ భరించేను పాపని గుండెలకు హత్తుకునే. ఉద్యోగం ఊళ్లోనే కాబట్టి అతనే కాంట్రా క్టర్ పనులు చేసుకుంటూ వచ్చిపోతుండేవాడు. జీతం తీసుకోవడానికి మాత్రం ఇద్దరం కలిసి వెళ్లేవాళ్లం. ఎక్వి టెన్స్‌లో నేను సంతకం చేస్తే 'జీతం' అతను అందుకునే వాడు. జీతానికి సంబంధించిన అన్ని సందేహాలు అతనే అడిగేవాడు. డి.ఎ., ఇంక్రిమెంట్లు, ఎరియర్స్ ఇలాంటి వేవీ నేను ఆలోచించేదాన్ని కాదు. నాకు తెలిసిందల్లా సంతకం చెయ్యడమొక్కటే. అవసరమైతే డబ్బులు అతన్నే అడిగేదాన్ని.

చీర ఎలా కట్టుకుంటే బావుంటుందో చెప్పే వాడు. హై హీల్స్‌తో ఎలా నడవాలో నడిచి చూపించే వాడు. ఏ టైమ్‌లో ఏ సెంట్ వాడాలో వివరించేవాడు. నలుగురిలో ఎలా నడుచుకోవాలో చెప్పేవాడు. అప్పుడప్పుడు వాళ్ల బంధువుల పెళ్లిళ్లకి, ఫంక్షన్‌లకి తీసుకు వెళ్లేవాడు. అక్కడ వాళ్ల చూపుల్ని భరించలేక ఎంత ఇబ్బందిపడేదాన్నో!

అమ్మానాన్నల బతుకు గోచీగుడ్డల్తో, పాత బట్టల్తో కొండ మీద పోడు చేసుకుంటూ అడవిలోనే గడిచిపోయింది. నేను మాత్రం హాస్టల్లో ఉండి చదువు కున్నాను. ఉద్యోగస్తురాలినయ్యాక కట్టుబొట్టు మారింది. మాటతీరు మారింది. ఫోను, టీవీ, ఫ్రిజ్ లాంటి వస్తువులు ఒక్కొక్కటీ ఇంటికి చేరాయి. కొండల మీద అవలీలగా ఎక్కేసే నాకు, కట్టెలమోపుని సునా యాసంగా దించేసే నాకు స్కూటర్ పై తిరగడం అల వాటై ఇప్పుడు కాస్త దూరం నడిచినా అలసిపోతున్నాను.

అప్పుడప్పుడూ వర్క్ ఇన్‌స్పెక్టర్లని, ఇంజనీర్లని ఇంటికి తెచ్చి పార్టీలు ఏర్పాటు చేసేవాడు. మందులోకి మంచినీళ్లు, తినడానికి బజ్జీలు అందించేదాన్ని. ఆ టైమ్‌లో వాళ్ల చూపులు నన్నెంత ఇబ్బందిపెట్టేవో! దానికి తోడు, 'పాపా అది తేరా... ఇది తేరా,' అని పాపని కూడా వాళ్ల మధ్యకి పిలిచేవాడు. వాళ్ల చూపులు పాప మీద పడకూడదని ఎంతలా ప్రయత్నించేదాన్నో!

లాంగ్ స్టాండింగని వేరే ఊరికి బదిలీ అయ్యింది. ఇల్లు మారిన తొలిరోజుల్లో అంతా కొత్తగా అనిపించింది. వీధిలో నలుగురు కలిస్తే నా గురించే. నా సంసారం గురించే గుసగుసలాడుతున్నట్టు అనిపించేది. అన్నీ భరించేను, పాప కోసం మౌనంగానే.

ఇరుగు పొరుగు వాళ్లతో పరిచయాలు క్రమంగా పెరిగాయి. అప్పుడే లక్ష్మితో పరిచయం అయ్యింది. ఆమె ఎదురింట్లో ఉండేది. కొన్నాళ్లకి మా పరిచయం స్నేహంగా మారింది. తీరిక సమయాల్లో ఆమెతోనే ఎక్కువగా గడిపేదాన్ని. ఇద్దరు పిల్లలున్నా భర్త నుండి విడాకులు తీసుకుంది. 'ఎందుకని,' అడిగితే పెద్ద సమా ధానమే చెప్పింది. వాళ్లది ప్రేమ వివాహమని, ఇద్దరూ వైజాగ్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసే వాళ్లని... ఇద్దరు పిల్లలు పుట్టాక అతనిలో వింత మార్పు వచ్చిందని చెప్పి, చివరికి 'అతన్ని భరించ లేక పోయాను' అని చెప్పింది. అప్పుడే చాలా పుస్తకాలు చదవమని ఇచ్చింది. ఒక స్వచ్ఛంద సంస్థలో పని చేస్తోందామె.

*

మళ్లీ తలుపు చప్పుడవుతోంది. వీధిలో కుక్కలు అరుస్తున్నాయి. ముఖాన్ని తలగడలోకి దూర్చి ఇంకా గట్టిగా కళ్లు మూసుకున్నాను.

''మనూరి బిడ్డికోడు లేడా?'' ఉపోద్ఘాత మిచ్చేడు. అతని వైపు చూసేను. ''డబ్బులు అవసర మట,'' అలాగే చూస్తూ ఉన్నాను. 'డబ్బు అవసరమని తీసుకు పోవడమే గాని తిరిగి ఇవ్వడం ఉండదు కదా...' అనుకున్నాను.

''మరేట్లేదు. ఆ గెడ్డోర రెండెకరాలు ఉంది గదా... ఇచ్చేస్తానంటున్నాడు. కొనేద్దాం,'' అంటూ ముగించేడు. నిర్ణయం ముందే తీసుకుంటాడు. ఏదో మొక్కుబడి కోసం చెప్తాడు. నా అభిప్రాయాన్ని ప్రకటించేలోగా, 'నీకేం తెలీదు ఊర్కో,' అంటూ బైక్ స్టార్ట్ చేసి వెళ్లిపోతాడు.

అది మొదలు ఎక్కడబడితే అక్కడ భూముల్ని చవగ్గా కొన్నాడు. అన్నీ నా పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించేడు. ఎందుకంటే అతని పేరున చెల్లదు కనుక. మెట్టు మొత్తం జీడి, టేకు తోటలు వేయించాడు. మిగతావన్నీ మా ఊళ్లోనే మా వాళ్లకే కౌలుకిచ్చేడు. వచ్చిన రాబడి మాత్రం ఏమయ్యేదో తెలిసేది కాదు. ఎప్పుడో ఓసారి మాత్రం, 'ఇదిగో నీ కోసం,' అంటూ ఒక ఉంగరమో, ముక్కుపుడకో తెచ్చిచ్చి నా నోరు మూసేవాడు.

ఇలాంటి విషయాల్లో చాలా ప్లాన్డ్‌గా ఉన్నట్టు కనిపిస్తాడు. అతని నిర్ణయాన్ని కాదంటే వికృతంగా మారతాడు.

"చామంతీ, నీతో మాట్లాడాలి," అన్నాడు లైటు వేస్తూ. ఆ మాట అనటానికి రిహార్సల్ చేసుకున్నట్టున్నాడు.

"ఇప్పుడా?" అన్నాను గోడమీది గడియారం వైపు చూస్తూ.

"ఔను. ఇప్పుడే," మంచమ్మీద కూర్చున్నాడు. అతని దగ్గర వచ్చే వాసనకి వాంతొచ్చినట్టయింది.

"చెప్పు," అన్నాను, దుప్పట్లో దూరిపోతూ. నాకు బాగా తెలుసు. చాలా విషయాలు నాతో ఆ సమయంలోనే మాట్లాడతాడు. పగలంతా ఏదో పనుల్లో తిరిగే అతడు రాత్రికే ఇల్లు చేరతాడు. అన్ని రాత్రులూ ఎలాగూ రాడు. వచ్చిన కొన్ని రాత్రుళ్లలో ఏవో అవసరాల్ని, కష్టాల్ని ఆవిష్కరిస్తాడు.

"ఈరోజు పేపర్ చూశావా? సిమెంట్ రేట్లు పెరుగుతాయట," అన్నాడు. అతనెప్పుడూ అలాగే మాట్లాడతాడు. చెప్పవలసిన విషయానికి ముందు గ్రౌండ్ ప్రిపేర్ చేస్తాడు. రావలసిన ప్రశ్న తన నుండి వచ్చాక, 'ఓసి పిచ్చిదానా,' అంటూ అసలు విషయం చెప్తాడు. ఆరోజు అదే జరిగింది. ఏవో కాగితాలు తెచ్చేడు. సంతకం చెయ్యమన్నాడు. నేను చెయ్యనన్నాను. బతిమాలేడు. నేను లొంగలేదు. కోపంగా చూసేడు. నేను బెదిరిపోనూ లేదు. అతని ముఖంలో రంగులు మారేయి.

"ఏమి?" కర్కశంగా చూసేడు నావైపు.

"నాకిష్టం లేదు అంతే. ఇంక మాటలనవసరం," అన్నాను. ఇలాంటి సమయాల్లో బహుశా లక్ష్మి ఇలాగే సమాధానం చెప్పి ఉంటుందా? ఎప్పుడో చెప్పాల్సిన సమాధానం ఇన్నాళ్లకి కాస్త మొండిగా నిలబడ్డాను.

నేనూహించలేనంత వేగంతో నా జుట్టు పట్టుకొని కిందకి వంచాడు. బలంగా నా వీపు మీద కొట్టేడు. లేచి నిలబడి చూసేలోగా చెంప ఛెళ్లుమనిపించేడు. కళ్లు బైర్లు కమ్మేయి. దెబ్బని భరించేను. ఎందుకోగాని కన్నీళ్లు రాలేదు నాకు. ఈ పెనుగులాటకి పాప లేచింది.

"నాన్నా," అని అరుస్తూ అడ్డుకుంది.

మత్తు, ఆపై కోపం. అంతకు మించిన నా సమాధానం. భరించలేకపోయాడు. అతని శరీరం వణుకుతోంది. కళ్లు ఎర్రబడ్డాయి.

"ఎవడే నీకు నాన్న? నేననుకున్నావా? మీయమ్మ ఎందరితో తిరిగిందో... నువ్వే కొండోడికి పుట్టేవో... లం... కూతుర్లారా..." ఇద్దరినీ చూపుడువేళ్లతో హెచ్చరిస్తూ బీరువాలోని డబ్బు తీసుకుని బైక్ స్టార్ట్ చేసి వెళ్లిపోయాడు.

ఇద్దరం ఒకరినొకరు పట్టుకొని, పడివున్నచోటే ఏడుస్తూ గడిపాము రాత్రి. 'ఏ పశువులు కాస్తున్నపుడో, అడవిలో కర్రలు తెస్తున్నపుడో ఎవడితో తిరిగేవో... ఎవడికి తెలుసు,' అని గతంలో చాలాసార్లు నన్ను అనుమానించి, అవమానించాడు. కాబట్టి నాకు అది కొత్త గాదు. ఎన్నో రాత్రులు నిద్ర లేకుండా గడిపాను. ఎంతో దుఃఖాన్ని దిగమింగుకున్నాను. అంతా పాపకోసమే. ఇలాంటివన్నీ ఈ వయసులో పాప ఎలా తట్టుకోగలదు? నేను చేసిన తప్పేమిటో ఎలా చెప్పగలను పాపతో? నా తప్పుకి పాప ఎందుకు శిక్ష అనుభవించాలి?

పాపని టౌను హాస్టల్లో చేర్పించాను. ఇంట్లో ఒంటరిగా గడిపేదాన్ని.

అలాగే కొన్నేళ్లు గడిచాయి.

ఒక్కోసారి చావాలనిపించేది. అప్పుడే... అలాంటప్పుడే... లక్ష్మి మాటలు కొంత మానసికంగా ధైర్యాన్నిచ్చేవి. ఒంటరి బతుకు పట్ల భయం పోగొట్టేవి. రేపటి గురించి ఆశలు సజీవంగా వుండేలా చేసేవి. "ఎందుకు భయపడతావ్? జీతం నీది. జీవితం నీది. ఎవరికీ తల వంచాల్సిన పనిలేదు. దుఃఖాన్ని భరిస్తూ పడుండాల్సిన అవసరం అంతకంటే లేదు," అని ఆమె చెప్పినప్పుడల్లా పాప గురించే ఆలోచించేదాన్ని.

నా పేరుతో భూముల్ని కొని అనుభవించినపుడు, బేంకుల్లోనూ, చీటీలతోనూ అప్పుల మీద అప్పులు తెచ్చినపుడూ ఏమీ అనలేకపోయేను. తాగి అనుమానించి అవమానించినపుడూ, చేయి చేసుకున్నపుడూ, మాటమాటకీ 'కొండోళ్లు... కొండోళ్లు,' అంటూ నా జాతిని హీనంగా చూసినపుడూ ఏమీ అనలేకపోయాను. అన్నీ భరించేను.

కాని నిన్నటికి నిన్న...

''చామంతీ నిన్న విజయనగరం వెళ్లేను,'' అంటూ దగ్గరకొచ్చేడు. నేనేమీ మాట్లాడలేదు. ''జిల్లా ఇన్‌ఛార్జిని కలిసేను. అన్నీ వివరంగా మాట్లాడేము. టిక్కెట్టు మనకే వస్తుంది. ఆయన రేపు మన ఊరే వస్తున్నారు. గెస్ట్ హౌస్‌లో ఉంటారు...'' ఆ తరువాత అతనన్న మాటలకి నా మతిపోయింది. వింటిబద్దను బలంగా లాగి శిలకోలను గుండెల్లోకి గురి చూసి వదిలినట్టు అయింది. అతని మాటలు క్రమక్రమంగా అర్థమవుతున్నాయి. ''పాపనోసారి ఇంటికి పిలిపించు. ఇన్‌ఛార్జిని పార్టీకి పిలిచేను,'' అన్నాడు. ఇంకా ఏదో చెప్తున్నాడు.

కోపంతో నా శరీరం అదుపు తప్పింది. శక్తినంతటినీ కాళ్లలోకి తెచ్చుకున్నాను. అంతే, ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలీలేదు. చూస్తే... కూర్చున్న కుర్చీతో సహా ద్వారం అవతల పడి ఉన్నాడు. తలుపులు మూసుకున్నాను.

చీకటి.

రేతిరి నా దుఃఖంలో ఈదుతున్నట్టుంది.

తలుపుల చప్పుడు ఆగి చాలాసేపయ్యింది. పాప గుర్తొచ్చింది. లక్ష్మి మాటలూ గుర్తొచ్చేయి. ఒక నిర్ణయానికి వచ్చి తలుపు తీసేను. వరండాలో విసర్జనాల మధ్య అసహ్యంగా పడి ఉన్నాడతను. అతన్ని దాటి బయటికి అడుగు వేశాను.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 24 మే 2009*

